క్లుప్తంగా

అంబేడ్కర్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి రాజనర్సింహ

కంభం: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నట్లు షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవ రావు పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ చేతుల మీదుగా అంబేడ్కర్ డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు, నాయకులను మంత్రి అభినందించారు.

అడవి పందిని చంపిన వ్యక్తి అరెస్టు

గిద్దలూరు రూరల్: అడవి పందిని చంపిన కేసులో ఓ వ్యక్తిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని జయరాంపురం గ్రామ సమీపంలో గల అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. జయరాంపురం గ్రామానికి చెందిన కొండయ్య అనే వ్యక్తి అడవి పందిన చంపి, మాంసం కోస్తున్న సమయంలో అటవీశాఖ అధికారులు దాడి చేశారు. నిందితుడిని అరెస్టు చేసి, అడవి పందిని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం



రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లిన వాహనం

బేస్తవారిపేట: స్థానిక పాత సినిమా హాల్ సెంటర్ సమీపంలో గురువారం అనంతపురం–అమరావతి జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. గొర్రెల లోడుతో కడప నుంచి సాగర్‌కు వెళ్తున్న ట్రక్.. యూటర్న్ తీసుకుంటున్న మరో ఫోర్ వీలర్‌ను ఢీకొట్టింది. ఫోర్‌వీలర్ అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఢీకొట్టి ఉంటే ఫోర్‌వీలర్ వాహనంలో ఉన్న ఇద్దరూ విగతజీవులయ్యేవారు. ట్రక్ డ్రైవర్ అప్రమత్తంగా ఉండి సడన్ బ్రేక్ వేయడం, అదుపుతప్పిన ఫోర్‌వీలన్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల పక్క నుంచి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటనలో ఫోర్ వీలర్ డ్రైవర్ కె.సయ్యద్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

కంభం: అడవి పంది దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం రాత్రి మృతి చెందాడు. వివరాలు.. కంభం పట్టణంలోని తెలుగువీధికి చెందిన అప్పరబోయిన శ్రీనివాసులు(52) ఈ నెల ఒకటో తేదీన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో యర్రబాలెం సమీపంలో అడవి పంది దాడికి తెగబడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం అర్ధరాత్రి సమయంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి కంభం ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు.

16న న.ర.సం సదస్సు

ఒంగోలు మెట్రో: నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం)7వ వార్షికోత్సవ సదస్సులు ఈనెల 16న కర్నూలులో జరగనున్నాయని నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమం కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో భారీస్థాయిలో నరసం రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ దండేబోయిన పార్వతి, స్థానిక కార్యవర్గం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. నరసం కర్నూలు జిల్లా అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి సభాధ్యక్షురాలిగా, సభను మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ ప్రారంభిస్తారన్నారు. కావునా రచయిత్రులు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె ప్రకటనలో కోరారు.

జగనన్న కాలనీపై చిన్న చూపు

- కాలనీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు
- వెలగని వీధిలైట్లు
- డ్రైనేజీ లేక రోడ్లపైనే మురుగు నీరు

గిద్దలూరు రూరల్:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి జగనన్న కాలనీలపై చిన్నచూపు చూస్తూ సమస్యలను పెడచెవిన పెడుతున్నారు. జగనన్న కాలనీల్లో నివశించే వారి పై పక్షపాత ధోరణితో అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని రాజానగర్ సమీపంలోని జగనన్న కాలనీలో 343 గృహాలు ఉన్నాయి. అందులో 300 కు పై గృహాలు నిర్మాణాలు చేపట్టారు. రాజానగర్ మీదుగా వెళ్లే ప్రధాన రోడ్డు అధ్వానంగా ఉంది. కాలనీలోని అంతర్గత రోడ్లు కూడా బాగోలేవు. దీంతో ప్రజల రాకపోకలు ఇబ్బందికరంగా ఉంది. వీధి లైట్లు వెలగక రాత్రుల సమయంలో రాకపోకలకు అవస్థపడుతున్నారు. కొండ ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో పాములు, విషపురుగులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారని స్థానికులు తెలిపారు. పట్టణంలో నుంచి కాలనీకి చేరుకోవాలంటే ఒక ఊరి నుంచి మరో ఊరికి చేరుకున్నంత పని అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఆటో బాడుగ అధికంగా వసూలు చేస్తున్నారు. రోడ్ల వసతి లేని కారణంగా కొన్ని గృహాలు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. సైడు కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని మురికి నీరు వచ్చి వీధుల్లో చేరుతూ దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కొండపేట రోడ్డులోని జగనన్న కాలనీలో సైతం ప్రజలు ఇదే తరహాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటి కైనా సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు స్పందించి తమ సమస్యల పై దృష్టి పెట్టి పరిష్కరించాలని జగనన్న కాలనీల వాసులు కోరుతున్నారు.



గిద్దలూరు శివారులోని జగనన్న కాలనీ వ్యూ..



అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్డు



మూడు నెలలుగా వెలగని వీధిలైట్లను చూపిస్తున్న స్థానికుడు షేక్.ఖాజా పీరా



డ్రైనేజీ కాలువ లేకపోవడంతో ప్రధానరోడ్డు పై నిలిచిన మురికి నీరు

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియెట్ ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో చేరేందుకు 2024–25 సంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 4వ తరగతి చదివి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2016 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. బీసీ, ఓసీ విద్యార్థులు 2014 ఆగస్టు 1 నుంచి 2016 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో చేరే విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి తొలిసారి ఉత్తీర్ణులై ఉండాలని స్పష్టం చేశారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్షను అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నిర్వహిస్తామని వెల్లడించారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: గురుకులు పాఠశాలల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చీమకుర్తి గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ ఫ్లొరెన్స్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ నెల 6న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు చీమకుర్తిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలను సందర్శించి వివరాలు తెలుసుకోవాలని ప్రకటనలో కోరారు.

అద్దె భవనాలే ముద్దు!



గాంధీ బజారులో శిథిలావస్థలో ఉన్న మున్సిపల్ స్కూల్



అయ్యప్పస్వామి గుడి వెనుక ఉన్న ఖాళీ స్థలం

- మార్కాపురంలో నిరుపయోగంగా మున్సిపల్ భవనాలు, స్థలాలు
- నేటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్న పలు ప్రభుత్వ కార్యాలయాలు
- స్థలాలు, శిథిల భవనాల అభివృద్ధిపై దృష్టి సారించని పాలకులు పంచాయతీలకు

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రభుత్వ స్థలాలు, మున్సిపల్ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని ఉపయోగంలోకి తెచ్చి అద్దె భవనాల్లో ఉన్న కార్యాలయాలను మార్చినట్లయితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అయితే ఆ దిశగా పాలకులు ఆలోచన చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. మార్కాపురం పట్టణంలో లేబర్ ఆఫీసు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, రవాణా శాఖ కార్యాలయం, గృహనిర్మాణ శాఖ, ఈఎస్‌ఐ వైద్యశాల, సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

బాగు చేయాల్సింది వీటినే..

స్థానిక గాంధీ బజారులోని మున్సిపల్ స్కూల్, అయ్యప్పస్వామి గుడి వెనుకవైపున ఉన్న ఖాళీ స్థలం, కంభం బస్టాండు వద్ద ఉన్న ఆర్‌అండ్‌బీ భవనం, టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న పాత వైద్యశాల భవనం, చిన్న మసీదు వద్ద ఉన్న అక్కమ్మబావి స్థలంతోపాటు పలు ప్రాంతాల్లో మున్సిపల్ స్థలాలు, భవనాలు ఉన్నాయి. ప్రస్తుతం వీటి విలువ లక్షల రూపాయలు పలుకుతోంది. అయితే ఎన్నో సంవత్సరాలుగా శిథిలావస్థకు చేరిన వాటిని తొలగించి నూతన భవనాలను నిర్మించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మరోవైపు లక్షల రూపాయల్లో ప్రతినెలా అద్దెలు చెల్లించేందుకే ఇష్టపడుతున్నారు తప్పితే శాశ్వత భవనాల నిర్మాణంపై దృష్టి సారించడం లేదు. భవనాలు శిథిలావస్థలం చేరి విషసర్పాలు, పురుగులు వస్తుంటంతో సమీప గృహాలకు చెందిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని భయపడుతున్నారు. ఇదిలా ఉంటే కొన్ని ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాలు, ఖాళీగా ఉన్న స్థలాలను అభివృద్ధి చేయాలని పట్టణ వాసులతోపాటు వివిధ ప్రభుత్వ శాఖ సిబ్బంది సైతం కోరుతున్నారు.



అక్కమ్మబావి వద్ద ఉన్న మున్సిపల్ స్థలం



కంభం సెంటర్‌లో ఉన్న ఆర్‌అండ్‌బీ భవనం



టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణానికి హాజరైన భక్తులు

తర్లుపాడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. ముందుగా దేవదేవేరులను ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపంపై ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రోచ్ఛరణ మధ్య స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తర్లుపాడుతోపాటు నాయుడుపల్లి, మీర్జపేట, చెన్నారెడ్డిపల్లి, తుమ్మలచెరువు, కేతగుడిపి తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్ ఈఓ చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, సత్యసాయి భజన మండలి కన్వీనర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉభయ దేవేరులతో వేణుగోపాలస్వామి

వైఎస్సార్ సీపీ నేత కుమారుడికి ఘన నివాళి



కిషోర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: పట్టణానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మేకల బయ్యన్నయాదవ్ కుమారుడు మేకల కిషోర్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని గురువారం గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కిషోర్ చిన్న వయసులోనే మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరుడు కృష్ణకిషోర్‌తోపాటుగా పలువురు నాయకులు నివాళులర్పించారు. మండలంలోని అంబవరం గ్రామంలో విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో కిషోర్ ఆపరేటర్‌గా పనిచేస్తుంటాడు.



ఆకర్షణీయంగా సూర్యబింబం

మనోహరం.. సూర్యాస్తమయం

బేస్తవారిపేట: సూరీడు అస్తమిస్తున్న వేళ ప్రకృతి కాన్వాస్‌పై సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. పగలంతా సెగలు కక్కిన భానుడు సంధ్యవేళకు అలసిపోయి కొండల్లో వాలిపోతున్న రమణీయ దృశ్యాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. బేస్తవారిపేట సమీపంలోని చీతిరాల కతువ వద్ద ఈ చిత్రాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.



కొండల్లో ఒదిగిపోతున్న భానుడు

శివారు కాలనీల్లో మురుగు తొలగిస్తాం

- మార్కాపురం మున్సిపల్ కమిషనర్ నారాయణరావు



మురుగు కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారు కాలనీల్లో మురుగు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనరు నారాయణ రావు తెలిపారు. గురువారం ఆయన భగత్‌సింగ్ కాలనీ, పీఎస్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. శివారు కాలనీల్లో డ్రైనేజీలు, లైటింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ హర్షిత కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కమిషనర్ క్షేత్ర స్థాయిలో పర్యటించి పారిశుధ్య సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఆయన వెంట వార్డు సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.